మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
మంగళవారం , 06, అక్టోబర్ , 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## 'ఇక చాలు బ్రో' - జ్ఞానేశ్‌కుమార్

# రాజీనామా చేయాల్సిందే

- ఎన్నికల సంఘం కార్యాలయం ఎదుట ఇండియా కూటమి ఎంపీల నిరసన
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్
- అక్టోబర్ 10 నుంచి కాంగ్రెస్ దేశవ్యాప్త ప్రచారం
- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో భారీ సభ



**న్యూఢిల్లీ:** ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు మంగళవారం ఢిల్లీలో నిరసన చేపట్టారు. పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్' వరకు ర్యాలీగా బయలుదేరారు. 'సేవ్ డెమోక్రసీ' అంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ, జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బారికేడ్‌పైకి ఎక్కారు. అనంతరం అక్కడే బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జ్ఞానేశ్ కుమార్‌పై ఆందోళనను మరింత ఉద్ధృతం చేసేందుకు కాంగ్రెస్ ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ అంశాన్ని పార్లమెంట్ శీతాకాల సమావేశాల వరకు ప్రజల్లో చర్చలో ఉండేలా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ఎన్నికల సంఘాన్ని 'చీటింగ్ కమిషన్'గా పేర్కొంటోంది. అక్టోబర్ 10 నుంచి 20 వరకు 'సేవ్ ఓట్.. సేవ్ కంట్రీ' పేరుతో బ్లాక్ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. సైకిల్, బైక్ ర్యాలీలు చేపట్టడంతో పాటు జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేయడం, కరపత్రాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనుంది. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25 వరకు బూత్ స్థాయిలో 'సేవ్ ఓట్.. సేవ్ కంట్రీ' చౌపాల్స్ నిర్వహించనుంది. వీటిలో కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొంటారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. నవంబర్ 25, 26 తేదీల్లో ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఆరు వేర్వేరు 'చలో ఢిల్లీ' మార్చ్‌లు చేపట్టాలని నిర్ణయించింది. వేర్వేరు నేతలు వీటికి నాయకత్వం వహిస్తారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ మార్చ్‌లు ఢిల్లీలో కలుస్తాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 26 తర్వాత ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అక్కడ కూడా ఎన్నికల సంఘం అంశాన్ని లేవనెత్తాలని కాంగ్రెస్ భావిస్తోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘానికి సంబంధించిన కేసుపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల సంఘానికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికలకు సంబంధించిన నిర్ణయాలు ఏకాభిప్రాయంతో తీసుకోకపోతే వాటిపై నిలుపుదల విధించే అవకాశం ఉండొచ్చని కోర్టు వ్యాఖ్యానించింది.

# ఫేక్ సర్టిఫికెట్ల బాగోతం

## తెలంగాణలో 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల తొలగింపు



**హైదరాబాద్ :** తెలంగాణలో నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన 35 మంది ప్రభుత్వ జూనియర్ లెక్చరర్లను ఇంటర్మీడియట్ విద్యాశాఖ విధుల నుంచి తొలగించింది. వారు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని ధ్రువీకరణ కావడంతో ఈ కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదట కాంట్రాక్టు లెక్చరర్లుగా పనిచేసిన వీరందరినీ 2023లో ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసింది. అయితే, వారి విద్యార్హత పత్రాలపై అనుమానాలు రావడంతో ఇంటర్మీడి యట్ విద్యాశాఖ ఆ సర్టిఫికెట్లను సంబంధిత విశ్వవిద్యాలయాలకు వెరిఫికేషన్ కోసం పంపింది. పరిశీలన అనంతరం ఆ సర్టిఫికెట్లు నకిలీవని యూనివర్సిటీలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ సదరు లెక్చరర్లకు షో-కాజ్ నోటీసులు జారీ చేసి, వారి వివరణ తీసుకున్న తర్వాత సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో రాజన్న-సిరిసిల్ల జిల్లా నుంచి ఆరుగురు ఉండగా, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ముగ్గురు చొప్పున ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, ఖమ్మం, నిర్మల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి ఇద్దరేసి లెక్చరర్లు ఉన్నారు. మరో ఎనిమిది జిల్లాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ జాబితాలో ఉన్నారు. ఇదే తరహా ఆరోపణలపై గతంలో సుమారు 10 మంది లెక్చరర్లను తొలగించినట్లు సమాచారం. ప్రస్తుతం మరో 320 మంది లెక్చరర్ల సర్టిఫికెట్లను కూడా వెరిఫికేషన్ కోసం యూనివర్సిటీలకు పంపినట్లు అధికారులు వెల్లడించారు.

## బ్యాంక్ ఉద్యోగులకు 5 రోజుల పని డిమాండ్‌కు

# కవిత మద్దతు



**హైదరాబాద్**

బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని, లేదంటే షిఫ్ట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పనిభారం పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులు చేస్తున్న ఈ డిమాండ్ న్యాయమైనదని ఆమె అభిప్రాయపడ్డారు. "బ్యాంకులు తెరిచినప్పటి నుంచి ఉద్యోగులు నిరంతర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. కస్టమర్లను చూసుకోవడం, బ్యాక్-ఎండ్ పనులు, టార్గెట్లు, నగదు సర్దుబాటు వంటి పనులతో సతమతమవుతున్నారు. పని గంటలు ముగిసిన తర్వాత కూడా రాత్రి 9, 10 గంటల వరకు పనిచేస్తున్నారు" అని తెలిపారు. గత దశాబ్దంలో డిజిటల్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు పెరిగినప్పటికీ, ఉద్యోగులపై పనిభారం ఏమాత్రం తగ్గలేదని ఆమె పేర్కొన్నారు. శనివారాలు పూర్తిగా సెలవులు ఇవ్వడం కష్టమైతే, బ్యాంకులను ఏడు రోజులూ తెరిచి ఉద్యోగులకు షిఫ్ట్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. కాగా, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (ఖఖీదీఖ) చాలా కాలంగా వారానికి ఐదు రోజుల పని కోసం పోరాటం చేస్తోంది. ప్రస్తుతం బ్యాంకులకు రెండవ, నాల్గవ శనివారాలు మాత్రమే సెలవులు ఉన్నాయి. ఈ డిమాండ్‌పై ఇటీవల సమ్మెకు పిలుపునివ్వగా, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (×దీూ) చర్చలకు అంగీకరించింది. ఈ అంశాన్ని పరిశీలించేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయడంతో యూనియన్లు సమ్మెను వాయిదా వేశాయి.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి..

# 'సర్' ప్రక్రియ ఆపాలి



**ఢిల్లీ, అక్టోబర్ 6:** ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. (మంగళవారం) ఏబీఎన్-ఆంధ్రజ్యోతి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో అనేక రాష్ట్రాలలో లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. పార్లమెంట్ మకర ద్వారా నుంచి కేంద్ర ఎన్నికల సంఘం వరకు ర్యాలీగా వెళ్తామని.. ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి పత్రాన్ని అందజేస్తామని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి మంత్రి అమిత్ షా తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నారని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఇద్దరూ కూడా ఖూనీ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. పార్లమెంట్ నుంచి ఈసీ వరకు వెళ్లకుండా ఎంపీల హక్కులను కాలరాస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు గుప్పించారు.

కాగా.. కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఎంపీలంతా ఆందోళన చేయనున్నారు. ఇప్పటికే పార్లమెంట్ మకరద్వారానికి ఇండియా కూటమి ఎంపీలు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ఎన్నికల సంఘం కార్యాలయంవైపు పాదయాత్రగా వెళ్లాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు.

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీం తీర్పు తర్వాతే

# ఎన్నికల షెడ్యూల్



**అమరావతి, అక్టోబర్ 6:** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య కీలక సమావేశం జరిగింది. మంగళవారం ఉదయం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి పవన్ కల్యాణ్ చేరుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. అనంతరం ముగ్గురు నేతలు బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కూటమి పక్షాలు కలిసికట్టుగా పనిచేయాలని ఈ భేటీలో నిర్ణయించినట్లు సమాచారం. శాతం లెక్కలతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో ఏ పార్టీకి బలం ఉంటే వారికే సీట్లు కేటాయించాలనే అంశంపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. వైసీపీకి ఒక్క స్థానం కూడా దక్కకుండా చేయాలనే పట్టుదలతో కూటమి నేతలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. తొలి దశలో జరగనున్న నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల ఎన్నికలపై ఈ చర్చలు కేంద్రీకృతమయ్యాయి.

## జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు

# హైకోర్టు నోటీసులు.




**హైదరాబాద్:** గాంధీ జయంతి సందర్భంగా నగరంలో మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు తెలంగాణ హైకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరిలో కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా ప్రవర్తించారంటూ దాఖలైన పిటిషన్‌పై నిన్న విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. తార్నాకకు చెందిన న్యాయ విద్యార్థి వడ్ల శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. గతంలో ఇలాంటి ఉత్తర్వులపై శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. స్లాటర్‌హౌస్‌లు, మాంసం దుకాణాల మూసివేతకు సంబంధించిన ఏ ఉత్తర్వులైనా జీహెచ్‌ఎంసీ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగానే ఉండాలని స్పష్టం చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది విజయ్ గోపాల్ కోర్టుకు వివరించారు.

## మన్నె క్రిశాంక్‌పై మరో

# కేసు నమోదు




**హైదరాబాద్:** బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌పై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ నేత మెట్టు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైనట్లుఎఫ్ఐఆర్‌లోపేర్కొన్నార ు. 2026 అక్టోబర్ 5న కేసు నమోదైంది. ఎఫ్ఐఆర్‌లో మన్నె క్రిశాంక్, 'ఎంఆర్ మీడియా తెలంగాణ'తోపాటు ఇతరులను నిందితులుగా పేర్కొన్నారు. దీచీూలోని 353(2), 352 సెక్షన్లకింద కేసు నమోదు చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన అవినీతి ఆరోపణలను ప్రశ్నిస్తూ మన్నె క్రిశాంక్ చేసిన వ్యాఖ్యలు, ప్రచురించిన అంశాలపై కాంగ్రెస్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదుపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గవర్నమెంట్ పాఠశాలలో శానిటేషన్ వర్కర్లకు జీతాల బకాయిలు చెల్లించాలి

●జూన్ నుంచి వేతనాలు అందక అవస్థలు

●దసరా వేళ కుటుంబ పోషణకు పైసా లేక

ఆందోళప్రజావాణి

**హనుమకొండ నవీన్ బ్యూరో**

**హనుమకొండ అక్టోబర్ 6:** హనుమకొండ జిల్లా పరిధిలోని యూపీఎస్ ప్రాథమిక పాఠశాలలు, జడ్పీఎస్ పాఠశాలల్లో శానిటేషన్ పనులు నిర్వహిస్తున్న సర్వీస్ పర్సనల్ వర్కర్లు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. జూన్ నెల నుంచి ఇప్పటివరకు తమకు చెల్లించాల్సిన వేతనాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. పాఠశాలల్లో పరిశుభ్రతను కాపాడుతూ ప్రతిరోజూ తమ విధులను నిర్వర్తిస్తున్నప్పటికీ, తమకు రావాల్సిన వేతనాలు మాత్రం సకాలంలో అందడం లేదని శానిటేషన్ వర్కర్లు పేర్కొంటున్నారు. తక్కువ వేతనంతో పనిచేస్తున్న తమకు నెలల తరబడి జీతాలు నిలిచిపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని చెబుతున్నారు.

దసరా పండుగ సమీపిస్తున్న వేళ పిల్లలకు కొత్త బట్టలు కొనివ్వడంతో పాటు ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు కూడా చేతిలో డబ్బులు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ సమయంలో తమ కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితి నెలకొందని కన్నీటి పర్యంతమవుతున్నారు.



**అధికారుల నిర్లక్ష్యంతోనే ఆలస్యం?**

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు ప్రభుత్వం, అధికారులు అండగా ఉంటారని భావించామని, కానీ నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నామని శానిటేషన్ వర్కర్లు చెబుతున్నారు. ఇతర పనులకు వెళ్లినా రోజువారీ కూలీతో కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగా ఉందని, అయినప్పటికీ పాఠశాలల్లో తమకు అప్పగించిన పారిశుద్ధ్య పనులను బాధ్యతగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో వివిధ రకాల బిల్లులు చెల్లిస్తున్న సమయంలో తమకు సంబంధించిన శానిటేషన్ వర్కర్ల వేతనాల బిల్లులను కూడా ప్రాధాన్యతగా పరిగణించి వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు. జూన్ నెల నుంచి ఇప్పటివరకు బకాయి ఉన్న మొత్తం వేతనాలను లెక్కించి, ఎలాంటి జాప్యం లేకుండా వారి ఖాతాల్లో జమ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**కలెక్టర్ స్పందించాలి**

హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ఈ సమస్యపై దృష్టి సారించి, సంబంధిత అధికారులతో మాట్లాడి జూన్ నుంచి పెండింగ్‌లో ఉన్న శానిటేషన్ వర్కర్ల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. పాఠశాలల పరిశుభ్రత కోసం పనిచేస్తున్న తమను కూడా ప్రభుత్వ యంత్రాంగంలో భాగంగా గుర్తించి, సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

"నెలల తరబడి పనిచేస్తున్నాం.. మా కష్టానికి రావాల్సిన డబ్బులు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించాలి? దసరా పండుగకు పిల్లలకు బట్టలు కొనడానికి కూడా డబ్బులు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జూన్ నుంచి రావాల్సిన మొత్తం బకా యిలను చెల్లించాలి" అని శానిటేషన్ వర్కర్లు కోరుతున్నారు.

## తెలంగాణ జర్నలిస్టుల జేఏసీ జిల్లా ఉపాధ్యక్షులు గా గరిడేపల్లి రాము నియామకం



**కోదాడ, అక్టోబర్ 05/ ప్రజావాణి** తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేజేఏసీ)లో సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులుగా గరిడేపల్లి రాము ని నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు తొగరి కరుణాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ ఈ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుంగ చాందిని తెలిపారు. నూతనంగా నియమితులైన జిల్లా ఉపాధ్యక్షులుగా తమ హోదాలో తక్షణమే అధికారిక బాధ్యతలు చేపట్టాలని ఆమె కోరారు. జేఏసీ నియమ నిబంధనలను పాటిస్తూ, క్రమశిక్షణతో పనిచేయడంతో పాటు సంస్థ చేపట్టే తదుపరి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన గరిడేపల్లి రాము కి ఈ సందర్భంగా జేఏసీ నాయకులు, సభ్యులు పలువురు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

## విజయ షాపింగ్ మాల్ అధినేతల మాతృమూర్తి మృతి పట్ల కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి సంతాపం




**జనగామ జిల్లా ప్రతినిధి జె.ఉపేందర్ , అక్టోబర్ 06(ప్రజావాణి):** జిల్లా కేంద్రం లోని విజయ షాపింగ్ మాల్, శ్రీలక్ష్మి షాపింగ్ మాల్ అధినేతలు భోగ భాస్కర్, కైలాసం ల మాతృమూర్తి భోగ కౌసల్య రాత్రి 10:30 గంటలకు వయోభార అనారోగ్య సమస్యలతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న 3వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి బాలాజీ నగర్ లోని వారి స్వగృహానికి వెళ్లి కౌసల్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# హాస్టల్ లో ఎలుకల బెడద.. విద్యార్థినికి కాటు

● పాఠశాల చుట్టుప్రక్కల దుర్భరమైన వాసన!.. పారిశుద్ధానికి తిలోదకాలు






**గూడూరు మండల ప్రతినిధి:- అక్టోబర్ 05. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల వసతి గృహంలో చోటుచేసుకున్న సంఘటన స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. హాస్టల్‌లో నిద్రిస్తున్న ఒక విద్యార్థినిని ఎలుక కొరకడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గురుకులంలో పరిశుభ్రత కొరవడటం, నిర్వహణా లోపాల వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తమవుతోంది. అధికారుల ఆకస్మిక తనిఖీ ఈ ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక గూడూరు తహశీల్దార్ నిమ్మతోట నాగభవాని తక్షణమే వసతి గృహాన్ని, కళాశాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. విద్యార్థినుల తో నేరుగా సంభాషించి, అక్కడ పాటిస్తున్న పరిశుభ్రత, రోజువారీ అందించే భోజనం యొక్క నాణ్యత, వసతులపై ఆరా తీశారు. అధికారుల విచారణలో విద్యార్థినులు తమకు ఎదురవుతున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఘటనను నీరుగార్చేందుకు కుట్ర? ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వ్యాపించి, మండల వ్యాప్తంగా వైరల్ కావడంతో కొందరు వ్యక్తులు ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల పరిధిలోని ఒక ఉపాధ్యాయ సంఘానికి చెందిన నాయకుడు రంగప్రవేశం చేసి, "ఇది చిన్న ఎలుక కాటు వార్తే కదా, మేనేజ్ చేయండి" అంటూ అధికారులను, సిబ్బందిని ఒత్తిడికి గురిచేసే ప్రయత్నం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి విద్యార్థుల ప్రాణాలతో కూడుకున్న విషయాన్ని అంత తేలిగ్గా కొట్టిపారేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రిన్సిపాల్‌పై చర్యలకు డిమాండ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థినుల భద్రతను, ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిన కళాశాల ప్రిన్సిపాల్‌పై తక్షణమే శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యార్థినుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత గురుకుల యంత్రాంగానిదేనని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# అంగన్వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం

**బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి**



**కూసుమంచి ప్రజావాణి అక్టోబర్ 6 :** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న 'అంగన్ మిలన్--సేవా కార్యక్రమం' కూసుమంచి మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వార్డు సభ్యులు, బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు, వర్కర్లను వారు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం, ఇతర సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ కోసం అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని గుండా ఉపేందర్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రేఖ సత్యనారాయణ యాదవ్, ఉపాధ్యక్షులు పొన్నం ఉపేందర్ నాయుడు, వార్డు సభ్యులు మంద నవ్య, చంద్రశేఖర్ గౌడ్, ఆడెపు శివ, బద్దం వెంకటరెడ్డి, దాసరి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ప్రాంతాల్లో 1/70, పేసా చట్టాల ఉల్లంఘన సహించేది లేదు

●అక్రమ కట్టడాలను వెంటనే నిలిపివేయాలి

● ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ హెచ్చరిక

●ఏజెన్సీ చట్టాలను కాపాడుకోవాలి

● నూతన పేసా కమిటీలను ఎన్నుకోవాలి



**కొత్తగూడ మండల ప్రతినిధి:- అక్టోబర్ 05 (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ గ్రామపంచాయతీ పరిధిలో పేసా గ్రామ సభ అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని, కొత్తగూడ గ్రామ పంచాయితీ కార్యదర్శి ఆడుప దివాకర్ కు మెమోరాండం సమర్పించిన తుడుం దెబ్బ నాయకులు. అనంతరం తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూనేం సందీప్ మాట్లాడుతూ... 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిన చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ, అక్రమంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూణేం సందీప్ కుమార్ డిమాండ్ చేశారు. 1/70 చట్టం అలాగే పేసా (పేసా) 1996 చట్టాలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ.. అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై శాఖాపరమైన, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నాయకులు స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల నిలిపివేత, ఏజెన్సీ ప్రాంతా లలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్మించడానికి చేస్తున్న ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని, 1/70, పేసా చట్టాల సమర్థవంతమైన అమలు చేయాలని, ఐదవ షెడ్యూల్ ప్రాంతాలలో ఆదివాసుల భూములు, హక్కుల రక్షణ కోసం 1/70 అలాగే పేసా కమిటీల అధికారాలను పూర్తి స్థాయిలో పరిరక్షించాలని, 1/70 అలాగే పేసా చట్టాల రక్షణ ఏజెన్సీలోని ఆదివాసీలందరి ప్రాథమిక బాధ్యతగా గుర్తించాలని, నూతన పేసా కమిటీల ఎంపిక చేయాలని, ఏజెన్సీ నిబంధనల ప్రకారం నూతన పేసా (పేసా) కమిటీల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ (ఐటీడీఏ పీవో) తక్షణమే ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఏజెన్సీ చట్టాలను అతిక్రమించి అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం అందిస్తున్న అధికారుల పై అలాగే సంబంధిత వ్యక్తులపై ఐటీడీఏ అధికారులు దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోకపోతే? రాబోయే రోజుల్లో కొత్తగూడ మండలం ఏజెన్సీ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు హెచ్చరించారు. ఒక పక్క గిరిజనేతరులు ఏజెన్సీ చట్టాలను హక్కులను జీవో లను తొలగించెందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలని గిరిజనేతరుల మాయలో పడొద్దు అని అన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ కొత్తగూడ మండల అధ్యక్షుడు నేను సందీప్ కువ ార్, తుడుం దెబ్బ మండల ప్రధాన కార్యదర్శి మల్లెల సారయ్య, ఆదివాసీ విద్యార్థిసంఘం వజ్జ రాహుల్, కంగాల నాగేశ్వర్ రావు వార్డ్ మెంబర్ జీపీ కొత్తగూడ, తోలేం వెంకన్న, పాల్గొన్నారు.

# కమలాపూర్ మండల్ లో బెల్ట్ షాపులపై ఎక్సైజ్ దాడులు

**గ్రామాల్లో జోరుగా సాగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై నిఘ**




**కమలాపూర్ :**పలు ప్రాంతాల్లో తనిఖీలు మద్యం స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్టు సమాచారం అసల ఎన్ని షాపులు? ఎంత మద్యం పట్టుబడింది? ఎవరిపై కేసులు? అధికారిక వివరాలు వెల్లడి కావాల్సిందే!!! ప్రజావాణి అక్టోబర్ 6 కమలాపూర్ మండల్ పరిధిలోని పలు గ్రామాల్లో బెల్ట్ షాపుల వ్యవహారం పై ఎక్సైజ్ శాఖ అధికారులు దృష్టి సాధించినట్లు సమాచారం గ్రామాల్లో అనాధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎక్సైజ్ ఎస్సై ఆధ్వర్యంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తుంది తనిఖీల్లో కొన్ని బిల్ట్ షాపులు గా అనుమతిస్తున్న ప్రాంతాల్లో మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం అయితే ఏ గ్రామంలో ఎంత మొత్తంలో మద్యం స్వాధీనం చేస్తున్నారు ఎంతమందిపై కేసులు నమోదు చేశారు స్వాధీనం చేసుకున్న మద్యం వివరాలు ఎంత? అనే పూర్తి వివరాలను ఎక్సేంజ్ శాఖ అధికారికంగా వెల్లడించాల్సి ఉన్నది గ్రామాల్లో బెల్ట్ షాపుల దందాపై చర్చ మండలంలోని కొన్ని గ్రామాల్లో అధికారిక అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి అన్న ఆరోపణాలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి ముఖ్యంగా రాత్రివేళలో పాటు ఇతరులు, మద్యానికి బానిసవుతున్నారంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లయితే వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు కేవలం అప్పుడప్పుడు దాడులు నిర్వహించడం కాకుండా బెల్ట్ షాపుల వెనుక ఉన్న అసలు వ్యవస్థపై కూడా అధికారులు దృష్టి సాదించాలని డిమాండ్ చేస్తున్నారు దాడులు జరిగాయి కానీ వివరాలు ఎక్కడ? ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చర్చనీ అంశంగా మారింది అయితే దాడులు ఏ గ్రామాల్లో జరిగాయి ఎంత మంది సిబ్బంది పాల్గొన్నారు ఎంత మద్యం పట్టుబడింది ఎంతమందిపై కేసులు నమోదయ్యాయి అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది ప్రజలకు పూర్తి సమాచారం అందించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు అధికారిక వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది

రెండు షాపులపై వరుసగా తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు అదే సమయంలో దాడులు వివరాలు కేసులు వివరాలు స్వాధీనం చేసుకున్న మద్యం పరిణామాలపై ఎక్సైజ్ శాఖ స్పష్టమైన ప్రకటన చేయాలని పలువురు కోరుచున్నారు ఇకనైనా ఎక్సైజ్ శాఖ కేవలం దాడులకే పరిమితం కాకుండా మండలంలో బెల్ట్ షాపుల నియంత్రణకు శాశ్వత చర్యలు తీసుకుంటుందా? అనేది వేచి చూడాలి...

# తెట్టెలపాడు నుంచి కాంగ్రెస్‌లోకి 25 కుటుంబాలు

**మంత్రి పొంగులేటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై**

**పాలేరు ప్రజావాణి అక్టోబర్ 5**

: తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు గ్రామానికి చెందిన 25 కుటుంబాలు బీఆర్ఎస్, ఎంఎల్, టీడీపీ పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పాలేరు నియోజకవర్గంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు. ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనకు ప్రాధాన్యమిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీతో పాటు రైతులు, మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రతి కుటుంబానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అండదండలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ పాలేరు నియోజకవర్గ చైర్మన్ చావా శివంమకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్, మాజీ ఎంపీపీ బోడా మంగీలాల్, మండల ఉపాధ్యక్షుడు సామా శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిమెట్ల వెంకట్, నాయకులు పుసులూరి సురేష్, మాజీ ఎంపీటీసీ గోళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com